(హాస్య నాటిక)

నిర్మాత : సీతారామయ్య - వయస్సు ఏభై. పల్లెటూరి మనిషి. తనతో సహా అందరూ మంచి వాళ్ళే ననుకుంటాడు.

దర్శకుడు : బ్రహ్మానందం - హేట్. సూట్. చేతిలో ఓ రూళ్ళకర్ర. సరదామనిషి.


రచయిత : జనశ్రీ-వయస్సు ముప్పై అయిదు, బుగ్గన కిళ్ళీ. నోట్లో సిగరెట్.

పరమేశ్వరం- గాంధీగారి టోపీ. ఖదరుచొక్కా.



# వెండితెర

పి. ఎస్. ఆర్. మూర్తి




**హీరో: రాజు-వయస్సు 25. పెకీ పాకగాడు అవసరమైతే జాపోగలడు నిదర్శాన్ని బట్టి**

**ఆఫీస్‌బోయ్ కొండయ్య- 10-15 మధ్య వయస్సు. లౌక్యం తెలిసిన కుర్రాడు.**

(తెర లేచే సరికి కొండయ్య కుర్చీలు, టేబిలు పాత గుడ్డలో తుడుస్తుంటాడు. నిక్కర్, బనియనూ వేసుకుని ఉంటాడు. బనియన్ మీద బ్రూస్‌లీ బొమ్మ ఉంటుంది. టేబిల్ మీద టెలిఫోన్, లెటర్‌పాడ్ ఉంటాయి. టేబిల్‌కి రెండువైపులా కుర్చీలుంటాయి. గోడ మీద వెంకటేశ్వరుడి కాలెండర్ వేలాడుతుంటుంది ).

కొండయ్య : ( హుషారుగా టేబిలు, కుర్చీలు తుడుస్తూ ) ఏమిటో ఇదివరకు హాయిగా పల్లెటూళ్ళో పనిచేసుకు బతికే వోణ్ణి. ఈడికి తీసుకొచ్చారు. ఆడికీ, ఈడికీ కాఫీ అందించలేక చస్తున్నాను.

పాలూ, పెరుగూ మా వూళ్ళో సుబ్బరంగా దొరికేవి. ఈడేం ఉంది? సాంబారుతప్ప. ( పాట హమ్ చేసి )

సినిమాల జోలి మన కెందుకండి—అంటే ఇనకుండా వచ్చాడు అయ్‌గారు, యాపారం వదిలేసి. నెత్తిన గుడ్డేసుకుని పోతాసు.

( సీతారామయ్య ప్రవేశం. ఆకాశంవైపో సారి చూసి నమస్కారం చేసి కుర్చీలో కూర్చుంటాడు. )

సీతారామయ్య : ఏందిరా, కొండా, ఏదో అంటున్నావ్, నెత్తిన గుడ్డని!

కొండయ్య : (మాట మార్చి) అబ్బే...ఏం లేదండి. చలి పుడుతుంటేనూ, తలకి గుడ్డ చుట్టుకుంటే తగ్గుతుందని అనుకుంటున్నానండి.

సీతారామయ్య : మాట మారిస్తే నాకు తెలీదనా? పచ్చి మిరపకాయల యాపారం చేసినోణ్ణి. మంతుర్లతో మాట్టాడినోణ్ణి. ఇక్కడ ఈళ్ళందరూ మునిగితే నెత్తిన గుడ్డేసుకుని పోతానని గదురా నువ్వంటుంది?

కొండయ్య : అంత మాట నే నంటానేటండి? నాకు స్వామిభక్తి ఎక్కువండి.

సీతారామయ్య : నీ స్వామిభక్తి నాకు తెలుసు లేరా. కాఫీ పట్రమ్మని బజారుకు పంపిస్తే సినిమా చూసొచ్చావు గదూ?

కొండయ్య : మొన్న చూసిన సినిమా సంగతెందుకుగానండీ, ఇప్పుడు మనం తియ్యబోయే సినిమా పేరేటండి?

సీతారామయ్య : "మంచం కింద ముగ్గురు"—ఈ ఆయిడియా మనకే వచ్చింది.

కొండయ్య : అయ్ బాబోయ్. అదేం పేరండి?

సీతారామయ్య : అదంతేలేరా. పిచ్చెదవ. అట్లా ఉంటేనే చూస్తారు జెనం. నీకు తెలీదు.

కొండయ్య : కతేంటండి?

సీతారామయ్య : (పెద్దగా నవ్వి) కతెందుకురా? కతేం ఉండదు మన దాంట్లో. ఒక రెండు ఫైట్లూ, నాలుగు డూయెట్లూ, మూడు డాన్సులూ, సివర్లో అందరూ కలుసుకున్నట్టు ఒక గూప్ఫోటో చూపిస్తే చాలు. జెనం చూసేసి ఇళ్ళకి పోతారు.

కొండయ్య : ఆళ్ళు పోయినా, పోకపోయినా, సినిమా రిలీజైన రెండోరోజున మనం మాత్రం ఇంటికెళ్ళాలండి.

సీతారామయ్య : శవిముండాకొడక ! తియ్యక తియ్యక నేను సినిమా తీస్తుంటే ముండమోస్తుందంటావురా? ఈసారన్నావంటే . . .ఒరేయ్ . . . నిన్ను పాండీ బజార్లో పావలా కమ్మేసి, చుట్ట కాలుస్తూ ఇంటికి పోతాను.

కొండయ్య : మర్చిపోయానండి. మీ రిందాక బజారు కెళ్ళినప్పుడు నలుగురు మనుషు లొచ్చారు.

సీతారామయ్య : దేనికిరా?

కొండయ్య : మా ఫైట్లానికండి!

సీతారామయ్య : అర్థమయ్యేటట్టు ఏడువు.

కొండయ్య : ఆళ్ళు పేడ యాపారం చేసుకునే వాళ్ళటండి.

సీతారామయ్య : (విసుగ్గా ) పేడేమిట్రా... ఆ యాపారమైనా మంచిదే. పిడకలు చేస్తారేమో. నువ్వూ ఆళ్ళతో కలువు, హోలుసేల్‌గా అమ్ముకోవచ్చు.

కొండయ్య : అది కాదండి. మన సినిమా ఇడుదలైన ఎంటనే, ఆళ్ళకి చెబితే, మిగితా పోస్టర్ల మీద పేడ కొడతారంటండి. అది ఆళ్ళ యాపారం.

సీతారామయ్య : నువ్వేమన్నా?

కొండయ్య: అంత కష్టం మీకెందుకండి? మన సినిమా కెటూ తక్కువే గదండి పోస్టర్లు. ఈటి మీదే కొట్టమన్నానండి.

సీతారామయ్య : ఇంకా నయం. నా మీద కొట్టించలేదు. నిన్ను...

( కొట్టడానికి కొండయ్య మీది కొస్తాడు. కొండయ్య అందకుండా తిరుగు తాడు. సీతారామయ్య ఆయాసంతో కూలబడతాడు కుర్చీలో ).

కొండయ్య : నా సలహా ఇని మెచ్చుకుని రెండ్రూపాయలిచ్చి పోయారండి.

సీతారామయ్య : ఏదో చిన్నప్పట్నించి సనిపాటలు చేస్తున్నావని తీసుకొచ్చా. నిన్నసలు ఈడికి తీసుకురావటమే పెద్ద తప్పు.

కొండయ్య : నేమా ఈడికి రావటం పెద్ద తప్పనుకుంటున్నానండి.

సీతారామయ్య : (వాచీ చూసుకుని) డైరెక్టరు వస్తానన్నాడు. తాగి ఎక్కడ పడు న్నాడో ఏమిటో ఇంతవరకూ రాలేదు.

కొండయ్య : డైరెక్టరుగారి పేరేంటండి?

సీతారామయ్య : బ్రహ్మానందం.

కొండయ్య : (హఠాత్తుగా ఏడుస్తూ ) బ్ర . . .హ్మా . . .నం . . . దమా?

సీతారామయ్య : ఇట్లా ఏడవ కూడదురా. రాక రాక మద్రాసొచ్చి, కంపెనీ తెరిస్తే ఏడుస్తావేరా? నిన్ను తీసుకొచ్చేటప్పుడే అనుకున్నాను, పిల్లిని చంకనెట్టు కొస్తున్నానని.

కొండయ్య : నేను పిల్లినండి. బ్రహ్మానందం బల్లి.

సీతారామయ్య : బల్లేమిట్రా?

కొండయ్య : అవునండి. ఆడు మీ నెత్తిమీద పడితే మీ రంతే సంగతులు. అయ్ గారూ . . . (ఏడుస్తూ ) మీరు చచ్చిపోతే ఇంత పెద్దూళ్ళో నే నెట్టా బతకాలండి?

సీతారామయ్య : (నిదానంగా ) బల్లికాదు, బాంబు పడ్డా చావను, నువ్వు చంపితే తప్ప. ఒరే... గొప్ప గొప్పోళ్ళు గొప్ప గొప్ప పన్లు చెయ్యటానికి పుడతారు. నే నసలు సినిమా తియ్యటానికే పుట్టాను—తెలుసా?

కొండయ్య : బ్రహ్మానందం తీసిన సినిమా ఏదీ నాలుగ్రోజులు కూడా నడవలేదండి. ఒకసారి ఇజైవాడలో ఆయన తీసిన సినిమా ఇంటర్వెల్లో జనం ఎళ్ళిపోతే బాక్సు పంపించేశారండి.

సీతారామయ్య : ఒరేయ్! వీళ్ళమాట వింటున్నానని కోతలు కొయ్యొద్దు. ఆయన ప్రెజా దర్శకుడు—తెలుసా? ఈ వూళ్ళో పేరు మోగిపోతుంది.

కొండయ్య : యాడండి? కనకదుర్గ ఇంటికాడా? కల్లు దుకాణాల్లోనా?

సీతారామయ్య : ( ఆసక్తిగా ముందుకొంగి ) కనకదుర్గెవ్రురా? నా కంటె నీకే చాలా ఇశేషాలు తెలిసినై.

కొండయ్య : ఈరోన్నవుదానని వచ్చిందండి. నువ్వు పనికి రావు పొమ్మన్నారు. ఇప్పుడు ఆవెకీ, అందరికీ పనికొచ్చే పనేందో చేసుకుంటున్నదండి.

సీతారామయ్య : ( పై పోజులోనే ) ఏం చేస్తుందిరా?

కొండయ్య : ( సిగ్గుతో మెలికలు తిరిగి ) నేను చిన్నపిల్లాణ్ణి కదండి? చెప్ప కూడదండి.

సీతారామయ్య : ఒరేయ్ ... ఒరేయ్ ... ఈ మద్రా సోళ్ళు నన్ను ముంచరు ... నువ్వే ముంచేటట్లున్నావురా?

కొండయ్య : మరందుకే గదండి మీతో వచ్చింది ...

( సీతారామయ్య కొండయ్యని తన్నబోతూ ఉంటాడు. బ్రహ్మానందం ప్రవేశిస్తాడు చేతిలో పొట్లంతో. )

బ్రహ్మానందం : నమస్కారమండీ, సీతారామయ్యగారూ! ఏమిటి కుర్రాణ్ణలా బాదే స్తున్నారు?

సీతారామయ్య : రండి, రండి ... డైరెక్టరుగారూ ( కొండయ్యతో ) ఒరే! కాఫీ పట్టుకు రారా?

కొండయ్య : ఆయన కాఫీ తాగరండి.

బ్రహ్మానందం : భలే కనిపెట్టావోయ్...నేను కాఫీ తాగను...యాపిల్ జ్యూసో, బాదం పాలో, కోలానో, మరీ మొహమాటపెడితే... బ్రాందీ ... అయినా నీ కెలా తెలుసు?

కొండయ్య : నేను చూడగానే కనిపెట్టేస్తానండి— అటన్నిటితోపాటు మా అయ్యగార్ని కూడా తాగేస్తారండి.

బ్రహ్మానందం : ( పెద్దగా నవ్వి ) నీ దెవడండి నిజాలు చెప్పేస్తున్నాడు. పెద్ద కేటుగాళ్ళా ఉన్నాడే?

సీతారామయ్య : ( గర్వంగా నవ్వి ) ఆడు నా నమ్మిన బంటు.

బ్రహ్మానందం : అసలు విషయానికొద్దాం. నా గొప్ప నేను చెప్పుకో కూడదు గానీండి ... నేను పరిషత్తు నాటకాలు కొన్ని డజన్లు డైరెక్టు చేశానండి ... ప్రతిచోటా ఉత్తమ దర్శకుడే. షీల్డులూ, ప్రైజులూ అందుకోలేక చచ్చా ననుకోండి. తర్వాత మద్రా సొచ్చాను. ఇక్కడ పూల రథాల్లో వూరేగిస్తా నన్నారు.

కొండయ్య : మీరే వద్దన్నారు కదండి?

బ్రహ్మానందం : అవును. ఎందు కిదంతా దండగ. ప్రజాసేవకి వినియోగించమని చెప్పాను. వూరుకున్నారా నే నెంత చెప్పినా? సన్మానం చేశారు. మర్నాడే అదంతా పేపర్లో ప్రకటించారు.

కొండయ్య : ఆ పేపరు నేనూ చూశానండి.

బ్రహ్మానందం : ( చిరాకుగా తల కొట్టుకొని ) బాబూ ... సిగరెట్ పెట్టె తెస్తావా? అలాగే ఒక కిళ్ళీ జర్దా బాగా వేయించి ...

( సీతారామయ్యవైపు చూస్తాడు. ఆయనేమీ డబ్బివ్వడు. తనే తీసి ఇస్తాడు బ్రహ్మానందం. )

కొండయ్య : ( డబ్బు జేబులో పెట్టుకొని ) అయ్‌బాబోయ్. నేను సిగరెట్ పెట్టె




తీసుకురాకూడదండి. నాకూ సిగరెట్లు కాల్చటం అలవాటై పోతుందండి.


బ్రహ్మానందం : అమ్మమ్మ ... పిడెవడోగానీండి అసాధ్యుడు. నా చిన్నతనంలో మా ఇంటి కెవరన్నా చుట్టాలొస్తే నేనూ ఇలాగే అనేవాణ్ణి.

సీతారామయ్య: అప్పు డేవన్నారో గాని, నన్నిప్పుడు టెక్నికలర్లో ముంచుతారో, ఈస్ట్‌మన్ కలర్లో ముంచుతారో అంతా మీ దయ. నా కీ వూర్లో ఎవరూ తెలీదండి.

బ్రహ్మానందం : అందుకేగదండి మిమ్మల్ని వెతుక్కుంటూ వచ్చింది. మిమ్మల్ని 70 ఎమ్. ఎమ్.లో ముంచేస్తాను. అదృష్టవంతులు గనక నన్ను పెట్టు కున్నారు డైరెక్టరుగా. ఇంకోడైతే మిమ్మల్నీపాటికి ఇంటికి పంపించేవాడు.

కొండయ్య : ( సీతారామయ్యతో ) ఈయన కాస్త ఆలస్యంగా పంపిస్తారండి. అంతే తేడా.

బ్రహ్మానందం : వాడి మాటకేంగాని, నన్ను డైరెక్టరుగా పెట్టుకున్నారు— బాగానే ఉంది. హీరోనూ, రైటర్నీ వెతుక్కున్నారా? మీ రింకా వెతుక్కో లేదని నాకు తెల్సు... వెతుక్కుంటే ఇలా ఎందుకుండేవాళ్ళు? ... హీరోగా నా కొడుకుని పెట్టుకోండి. ఇహ పోతే రైటరుగా ... మా వా డొకడు పనీ పాటా లేకుండా తిరుగుతున్నాడు. వాణ్ణి పెట్టుకోండి. వాడికి పాత సినిమా పాటలన్నీ వచ్చు. చిన్నప్పట్నించీ ఒకటే చూస్తున్నాడు కనక సినిమాలు,.



WH.5884

డైలాగులు మంచినీళ్ళు తాగినట్టు రాసి పారేస్తాడు.

కొండయ్య : మీకు మేనకోడ లుందండి?

బ్రహ్మానందం : ఉంది—నీ కెలా తెలుసు?

కొండయ్య : ఉంటే ఈరోయిన్‌గా పెట్టుకోవచ్చండి మన సిన్మాలో.

బ్రహ్మానందం : (భుజం తట్టి ) భలే గుర్తుచేశావు. పైకొస్తావురా. ఒక నాటి నువ్వు నిర్మాతవై పోతావు. నీకు ఫ్రీగా ఒక సినిమా డైరెక్టుచేసి పెడతాను.

సీతారామయ్య : ఇంతకీ షూటింగు ఎప్పుడు మొదలు పెడదామంటారు?

బ్రహ్మానందం: షూటింగు దేముందండి? రేపే పాటికి సిన్మాయే రిలీజు చేసెయ్యొచ్చు.

సీతారామయ్య : మరింతవరకూ కథ లేదు యాక్టర్లు లేరు. ఎట్లా మొదలు పెడదామంటారు?

కొండయ్య : ఇప్పు డీయన్తో మొదలైంది కదండి, రేపు మనిద్దరం రిలీజయ్యి ఇంటికి పోవచ్చండి.

బ్రహ్మానందం : వీడెవడండి చంపుతున్నాడు మనల్ని? సరే ... ఇహ అడ్వాన్స్ ఇవ్వండి—నేను త్వరగా వెళ్ళాలి. అర్జంటు పనుంది.

సీతారామయ్య : అడ్వాన్సా?

బ్రహ్మానందం : డబ్బనేసరికి గొంతు పట్టుకుందే? అవతల నాకు షూటింగుంది. త్వరగా పోవాలి.

కొండయ్య : వో సంగతి మీకు తెలీదండి.

బ్రహ్మానందం : ఏవిటది?

కొండయ్య : ఇయ్యాల ఆదివారం కదండి. డబ్బులు తెద్దామనుకున్నాం గాని, బ్యాంకు ల్లేవు.

సీతారామయ్య : సినిమా తియ్యడం మొదలుపెట్టండి. తర్వాత చూసుకుందాం.

బ్రహ్మానందం : నాకు రేపే అడ్వాన్సు కావాలి.

కొండయ్య : అదేం కుదర్దండి ...

బ్రహ్మానందం : సరే ... నా సంగతి మీకు తెలీదు ... ( సీతారామయ్యతో) మీరు రేపు సాయంత్రం పాండీబజార్లో కాష్ బ్యాగ్ పట్టుకు పోతుంటారు. సడన్‌గా ఏమవుతుందో తెలుసా? ... తెలీదు ... నలుగురు రౌడీలు సైకిల్ చైన్లతో వస్తారు. మిమ్మల్ని బాదేసి కాష్ బాగ్ పట్టుకు పారిపోతారు.

కొండయ్య : ( ఏడుస్తూ ) అదేంటండి? అంత అన్యాయమా?

బ్రహ్మానందం : రేపు ఉదయం అడ్వాన్స్ ఇవ్వకపోతే, రేపు సాయంత్రం అదే జరుగుతుంది—వస్తా ...( వెళ్ళిపోతాడు. )

సీతారామయ్య : ( తల పట్టుకొని కూర్చుంటాడు. ) ఆదేంట్రా? ఇంతవరకూ ఏమీ మొదలు కాలేదు, రేప్పొద్దున డబ్బు లివ్వక పోతే తన్నిస్తానంటాడు!

కొండయ్య : ఈ ఖ్రింతేనండి. పీల్చి పారేస్తారు.

సీతారామయ్య : ఈడు పీల్చటం సరే—ఆడి కొడుకు ఈరో, ఆడి మేనకోడలు ఈరోయిన్ను. ఇంకా ఆడికి చుట్టాలెవరూ లేరా?

కొండయ్య : ఇంకా ఆయనకి పెళ్ళి కాలేదండి. బతికిపోయాం. లేకపోతే పెళ్ళాన్ని కూడా మన సిన్మాలో పెట్టుకోమనేవాడు.

సీతారామయ్య : అదేంట్రా—ఆయ నోపక్క కొడుకున్నాడని చెబుతుంటే...

కొండయ్య: (నవ్వి) మీకు యవ్వారాలు తెలీవులెండి. పాపం, అమాయకులు.

సీతారామయ్య: ఆ యాపారం చేసుకున్నా పోయేది కదురా.

కొండయ్య: ( సడన్‌గా ) అయ్యగారూ...నేను ఇలన్‌గా ఉంటానండి మన సిన్మాలో.

సీతారామయ్య: నా నెత్తి నెక్కు.

కొండయ్య: అప్పుడే ఏమైందండి? ముందుంది ముసళ్ళ పండగ.

( జనశ్రీ ప్రవేశం )

జనశ్రీ: నా పేరు జనశ్రీ అంటారు జనం. నేను కొన్ని వందల సిన్మాలకు మాటలూ, పాటలూ సమకూర్చాను. నేను డైలాగులు రాశానంటే పిక్చర్ ఇరవై అయిదు వారా లాడుతుంది. నేను పాటలూ, డైలాగులూ కలిపి రాశా రాశానంటే పిక్చర్ ఏభై వారా లాడుతుంది.

కొండయ్య: అదే—జనం లేకుండా.

సీతారామయ్య: నువ్వూర్కోరా. కూర్చోండి. సినిమా తియ్యాలని వచ్చాం. ఏదో మీ లాంటి వాళ్ళని నమ్ముకున్నాం.

జనశ్రీ: (లేచి) అసలు మీ మొహంలోనే ఉంది ఆ కళ. అదే—సినిమా తీసే కళ కొట్టొచ్చినట్టు కనబడుతూంది. నే నిప్పుడు చూడగానే అనుకున్నాను— మనం తియ్యబోయే సినిమా ఒక సువర్ణ చరిత్రను సృష్టిస్తుందని.

కొండయ్య: ఇక్కడికి కొచ్చిన కొత్తలో కళగానే ఉండేదండి అయ్యగారి మొహం. ఇప్పుడు ప్రేతకళ పడిపోయింది కాని.

జనశ్రీ: వీడెవడు మధ్యలో కల్పించుకుంటాడు. నేను వీడితో మాట్లాడను. నిర్మాతగారూ! చెప్పండి, ఎలాంటి కథ కావాలి? మాటలు కావాలి? పాటలు కావాలి?

సీతారామయ్య: మంచి కథ ఏదో ఒకటి మీరే చెప్పాలి.

జనశ్రీ: ( గర్వంగా నవ్వి ) కథలూ, నాటకాలూ రాసి, రెండు బస్తాల నిండా పెట్టి, కుట్టేసి, దాచి పెట్టాను. చెప్పండి, ఎలాంటి కథ కావాలో! అసలు మిమ్మల్ని చూస్తుంటేనే నాకు అనేక కథలు పుట్టుకొస్తున్నాయి. మీరు భోజ మహారాజా వంటివారు. తరవాత మీరే రాయలవారయ్యారు. తరవాత మీరే...

కొండయ్య: మీరు కతలు చెప్పటాని కొచ్చారా? పొగడ్డాని కొచ్చారా!

జనశ్రీ: నేను రెండూ చెయ్యగలను. చెప్పండి, మీకేం కథకావాలో? చారిత్రకమా? పౌరాణికమా? జానపదమా? సాంఘికమా? ఏదీకాని కథా? అన్నీ కలిపిన కథా? స్పై చిత్రమా? రొమాంటిక్ థ్రిల్లరా! చెప్పండి, రాసేస్తాను. (చేతు లూపుతూ) మాటలూ, పాటలూ, గుప్పించేస్తాను.

కొండయ్య: అయ్ బాబోయ్. ఈ డెవడో భూతమాంత్రికుడిలా ఉన్నాడండి.

జనశ్రీ: అవును. నాకు మంత్రాలొచ్చు. శాకినీ, ఢాకినీ పిశాచాలని పిలుస్తాను. ఇప్పుడు బతకాలంటే ఇలాగే ఉండాలయ్యా.

సీతారామయ్య: మాకూ మంత్రా లొచ్చుగానీండి, చారిత్రకం సిన్మాకథ చెప్పండి.

జనశ్రీ: ( హుషారుగా ) రాణీ బుచ్చమ్మ కథ చెబుతాను. ( అటూ ఇటూ చూసి) కాఫీ గీడా ఏమీ లేదా? మర్యాదలు తెలీవు.

కొండయ్య: ఇవ్వాళ బంద్ అండి. దుకాణాలన్నీ మూసేశారు.

జనశ్రీ: నాతో అబద్ధాలు చెప్పకు. నే నిప్పటికే ఎంతమందికో చెప్పాను. ( సీతారామయ్యతో) ఏమిటి అంటున్నాను?

సీతారామయ్య: బుచ్చమ్మ కథ.

జనశ్రీ: ఆఁ. బుచ్చమ్మకాదు. పిచ్చమ్మ. ఆమె ఎవరనుకుంటున్నారు? ఆమె రాణీ.

కొండయ్య: అస లీ కత జరగలేదండి.

జనశ్రీ: నోర్మూసుకో. చరిత్ర తెలుసురా, చవటా, నీకు? చంద్రగుప్తుడూ, అలెగ్జాండరూ యుద్ధం చెయ్యగా లేంది, నేను...నేను రాణీ పిచ్చమ్మను చరిత్రలో కెక్కిస్తే తప్పా? ( సీతారామయ్యతో ) పిచ్చమ్మ ఒకనాడు మహారాణి. ఆమెకాలంలో ప్రజలందరూ సుఖంగా ఉండేవాళ్ళు. ఆమె తండ్రి ఒక రోజు స్వయంవరం ప్రకటించాడు.

సీతారామయ్య: ఇదెవడూ చూడ్డండి. సాంఘికంకత చెప్పండి.

జనశ్రీ: సాంఘికాలా? చాలా రకాలున్నాయి లెండి. అన్నా చెల్లెళ్ళ అనురాగం చెప్పనా? ప్రేయసీ ప్రియుల శృంగారం రాయనా! భార్యా భర్తల మహోన్నత ప్రేమ వర్ణించనా? త్యాగజీవుల మహోదాత్త కథ వినిపించనా! విప్లవాగ్ని కురిపించనా? చెప్పండి.

కొండయ్య: ఇవేమీ వద్దు గానీండి. డిటెక్టివ్ సిన్మాకత చెప్పండి.

జనశ్రీ: అదీ... ఇప్పుడు దారి కొచ్చారు. డిటెక్టివ్ ప్లస్ సెంటిమెంటూ పెట్టానంటే నూర్రోజులు గ్యారంటీ. అప్పుడే నా కళ్ళలో మన చిత్రం శతదినోత్సవాల వేడుకలు తిరుగుతున్నాయి. ఏమంటారు?

సీతారామయ్య: ఏదైనను కానీ కత చెప్పండి.

జనశ్రీ: మొత్తం ఎనిమిది ఫైట్లు, నాలుగు డాన్సులు, మూడు డూయెట్లు— మొత్తం నేనే రాసి పారేస్తాను.

కొండయ్య: ఫైట్లుకూడా రాసేస్తారండి?

జనశ్రీ: వెధవ ప్రశ్న లేయకురా. బడుద్దాయ్! (సీతారామయ్యతో) హీరో వెతుకుంటాడండి కొండల్లో.

కొండయ్య: ఎందుకండి?

జనశ్రీ: నువ్వు మాట్లాడావా ఆ కొండల్లో పాతి పెడతాను. అదంతా సస్పెన్స్. చిత్రం చివర్లో తెలుస్తుంది. ముందే తెలిస్తే ఎవరూ చివరి దాకా కూర్చోరు.

ఇంతలో...గుర్రాల మీద దొంగలొస్తారు.

కొండయ్య: ( ముందుకు వంగి ) ఒక డుగుతానండి. ఇంతకీ ... ఈంో ఎవరండి?

జనశ్రీ: ( బిగ్గరగా నవ్వి ) నే...నే.. నేనే హీరోని.

కొండయ్య: మీ రేం హీరో అండి? చెపుల పిల్లిలా మొహమూ, మీరూను.

జనశ్రీ: నేను హీరోగా పది నాటకాల్లో ఉన్నాను. అప్పుడు కుప్పలు తెప్పలుగా కురిశాయి.

కొండయ్య: చెప్పుల జతలు.


జనశ్రీ: కాదు—చప్పట్లు. వీడు పెద్దా చిన్నా లేకుండా మాట్లాడుతున్నాడు. వీణ్ణి ...

( తన్నబోతాడు )

సీతారామయ్య: (ఆపి ) వాడితో మీ కెందుకు లెండి. కుర్రాడు—ఏదో ఒకటి అంటాడు. మనం చూసీ చూడనట్టు వూరుకోవాలి. మీరీ కతే రాసుకురండి. ఫైట్లు మాత్రం పెద్ద పెద్దవి పెట్టాలి.

జనశ్రీ: నాదేం పోయిందండి? మొత్తం అవే చూపిద్దాం. ఏమంటారు? అలా చూపించినా మన సిన్మా ఆడుతుంది. ఎలా గనుకుంటున్నారు? నా పేరే జనశ్రీ. అంటే ప్రజలకి శుభం, నాకు లాభం.

కొండయ్య: అంతేలెండి. మన సిన్మాలో పేర్లు పడగానే ఎంటనే శు... [illegible]డి




పోతుంది.

జనశ్రీ: హద్దు మీరుతున్నాడు వీడు.

సీతారామయ్య: మీరు ఈ కతే రాసుకురండి.

జనశ్రీ: ( సడన్‌గా చెయ్యి జాపి ) అడ్వాన్సు...

సీతారామయ్య: ముందు రాసుకురండి. తరవాత చూద్దాం.

జనశ్రీ: ( కుర్చీలో కూలబడి ) నేను రాయను.

కొండయ్య: ఇప్పుడు రాస్తా నన్నారు కదండి?

జనశ్రీ: రాస్తానన్నాను కాని, ఇక్కడ రాయలేను.

సీతారామయ్య : మరెక్కడ రాస్తారు?

జనశ్రీ : ( కళ్ళుతేలేసి ) కాశ్మీరులో రాస్తాను కమనీయగీతాలు. డాల్ సరస్సులో విహరిస్తూ, ప్రకృతి సౌందర్యం ఆస్వాదిస్తూ పేజీలు పేజీలు రాసేస్తాను. ( చెయ్యి జాపి ) అందుకే అడ్వాన్సు కావాలి.

సీతారామయ్య : ఈడెవడో ఇవ్వకంటే కొట్టేటట్టున్నాడు.

జనశ్రీ : నేను ప్రేక్షకుల్ని పాటలతో కొడతాను, మాటలతో కొడతాను.

కొండయ్య : చీకటి పడిపోతే మా అయ్యగారు డబ్బులివ్వరండి.

జనశ్రీ : సరే, లేచిపోక పోతే చూస్తాను. నా మంత్రాలతో పిశాచాలని పిలిచి మీ చుట్టూ భీకర నృత్యాలు చేయిస్తాను —రేపు మళ్ళీ వస్తాను ..వస్తా ..

( వెళ్ళిపోతాడు.)

సీతారామయ్య : (గట్టిగా విట్టూరుస్తూ ) వానెలిసింది. ఆ డాసలు రైటరా? రాక్షి ఏదవా?

కొండయ్య : ఆడు మన్లాంటి మనుషుల దగ్గర రవుడీయేసండీ.

సీతారామయ్య : వచ్చిన ప్రతి గాడిద కొడుకూ డబ్బు అడిగేవోడే.

కొండయ్య : దిగులు పడొద్దండీ. ఇంకా చాలామంది వస్తారు.

( పరమేశ్వరం ప్రవేశం ).

పరమేశ్వరం : నా పేరు మీకు తెలీదు. మీ పేరు నాకు తెలుసు, సీతారామయ్య గారూ. నా పేరు ఎ. ఆర్. పరమేశ్వరం.

సీతారామయ్య : చందాల కొచ్చినట్టున్నాడు ( రెండ్రూపాయలు తీసిస్తాడు. జేబులో పెట్టుకుంటాడు పరమేశ్వరం. )

కొండయ్య : గాంధి గారి టోపీ పెట్టుకుంటే డబ్బు లియ్యటంవే. ఏం చేస్తారండి మీరు?

పరమేశ్వరం : సప్లై చేస్తాం.

కొండయ్య : సై మగుడ్నలా!

పరమేశ్వరం : (పెద్దగా నవ్వి ) కాదు, సిల్కుగుడ్డ లేసుకున్న ఆడపిల్లల్ని.

సీతారామయ్య : (కంగారుగా ) ఇది సినిమా కంపెనీ, బాబూ! దారి తప్పి వచ్చినట్టున్నావ్.

పరమేశ్వం : నా దారి ఇదే. జూనియర్ ఆర్టిస్టుల్ని సప్లయ్ చేస్తాను. ఆడపిల్లలే కాదు మగాళ్ళని కూడా. ఎలాంటివాళ్ళు, ఎప్పుడు కావాలంటే అప్పుడు...

సీతారామయ్య : ఆళ్ళెవర్రా?

కొండయ్య : డాన్సర్లగ్గర సిన్మాల్లో ఎగురుతుండరండి ఆళ్ళు.

సీతారామయ్య : మా కవసరమని నీకెట్టా తెలిసింది, బాబూ?

పరమేశ్వరం : అవన్నీ అడక్కండి. నేను ఎక్కడ, ఏది తెలుసుకోవాలంటే అది తెలుసుకోగల్ను.

కొండయ్య : మా అయ్‌గారి గురించి కూడా తెలుసా?

పరమేశ్వరం : (నవ్వి ) మీరు రాబోతున్నట్టు నెల్రోజుల ముందే తెలుసు. ఆయన ఫోటో కూడా నా దగ్గరుంది.

సీతారామయ్య : మా సిన్మాలో నాలుగు డాన్సులుంటై.

కొండయ్య : అవన్నీ కలల్లోనండి.

పరమేశ్వరం : ఇంకేం? కలల్లోనైతే ఎక్కువమంది డాన్సర్లు కనిపించాలి. మీకా దిగులేం అక్కర్లేదు. ఒకపూట భోజనం, మనిషికి ఏభై రూపాయలు—అంతే.

కొండయ్య : ఈ సంగతి తెలిస్తే, మా వూర్నించే తెచ్చుకునే వాళ్ళం అందర్నీ.

సీతారామయ్య : అసలు డాన్సుల్ని తీసేస్తే ఏమవుతుంది?

పరమేశ్వరం : (తాపీగా ) అప్పుడు మీ సిన్మాను మీరు పెళ్ళాం పిల్లలతో హాయిగా ఎన్ని రోజులైనా చూసుకోవచ్చు.

కొండయ్య : అసలు మేం సినిమాయే తియ్యవటండి.

పరమేశ్వరం : ఆ మాట మాత్రం అనొద్దు. నేను కావాల్సినంత హెల్ప్ చేస్తాను. ఏ. ఆర్. పరమేశ్వరమంటే ఆల్‌రౌండర్ పరమేశ్వరం. పాటలు పాడతాను. మేకప్ చేస్తాను. మీ కారు డ్రైవ్ చేస్తాను. కెమెరామన్‌గా ఉంటాను.

సీతారామయ్య : ఇన్ని రౌండ్లు మా వల్ల కదండి.

పరమేశ్వరం : నాలాంటి వాడు తెలిశాక కూడా మీరెందుకు భయపడుతున్నారో నా కర్థం కాదు.

కొండయ్య : ఈ వూరొచ్చిన దగ్గర్నుంచి కంటి మీద కునుకు లేదనుకోండి.

పరమేశ్వరం : భయపడితే ఎన్ని రోజులు బతుకుతారండి. ఎంతమంది ఆర్టిస్టులు కావాలో చెప్పండి?

సీతారామయ్య : ఇదెక్కడి గొడవరా బాబూ. మాకక్కర్లేదుపో. ఇంతవరకూ ఏదీ మొదలుకాలేదు. అప్పుడే డాన్సర్లంట.

పరమేశ్వరం : ఇందాక కొన్ని రౌండ్లే చెప్పాను. ఇప్పు డింకో రౌండు చెబుతాను, వినండి. నా దగ్గర ఆడపిల్లల ఫోటోలున్నయ్. మీ ఫోటో ఉంది. ఒక పిల్ల ఫోటో, మీదీ జాగర్తగా కలిపేసి, 'పేపరుకిచ్చేస్తే...' (నవ్వి) పేపరు మీ వూరెళ్తుంది. మీ ఆవిడా, పిల్లలూ మీ చుట్టాలూ, స్నేహితులూ . . .

సీతారామయ్య : బాబూ! షూటింగ్ మొదలవ్వగానే పిలిపిస్తాను. ఇప్పుడు దయ చెయ్యి. ( వెళ్ళిపోతాడు.)

సీతారామయ్య : ఏరక్కపోయి వచ్చాంరా దేవుడా? చంపుతున్నారు.


## జలుబు వల్ల ఓ మంచి రోజును పాడవనివ్వకండి



### జలుబును పోగొట్టుకోవచ్చు


ముక్కు కారడం, ముక్కు దిబ్బడ. తలభారం, గొంతు నొప్పి. గుండెలో కఫం చేరడం లాంటివన్నీ మీ మంచి రోజుల్ని పాడు చేస్తాయి. అయితే. ఈ లక్షణాలుగల జలుబునుంచి ఉపశమనానికి ఓ మార్గం ఉంది.

### జలుబు మందుతో వాటిని ఎదుర్కొండి

ఏ ఇతర జబ్బుకో చికిత్స చేసినట్టు జలుబుకి చికిత్సచేస్తే చాలదు. జలుబు లక్షణాలకు లోనైన అన్ని చోట్లా ఒకే మారుగా పనిచేసే ప్రత్యేకమైన మందే వాడండి

### కోల్డరిన్ కేవలం జలుబు కోసమే

మిమ్మల్ని ఇబ్బంది పెట్టే అన్ని జలుబు లక్షణాలనుంచి ఉపశమనం కలిగిస్తుంది కోల్డరిన్. దీనిలోని ప్రత్యేకమైన ఔషధ పదార్థాలు జలుబు లక్షణాలుగల అన్నిచోట్లా కలిసికట్టుగా పనిచేస్తాయి. పైగా మీ శరీరంలో నిరోధక శక్తిని పెంచే విటమిన్ సి దీనిలో ఉంది. మీకు జలుబు చేస్తే, దానికి ప్రత్యేకమైన జలుబు మందే వేసుకోవడం ఉత్తమం.



# కోల్డరిన్

జలుబు కోసం ప్రత్యేకంగా తయారుచేయబడింది

CASBC-44-232 TL

కొండయ్య : గాంధి టోపీ పెట్టుకొచ్చాడని చందా ఇస్తే, డబ్బులు జేబులో పెట్టుకొని, మనకి టోపీ పెట్టాడు.

సీతారామయ్య : ఇక లాభం లేదురా. ఇంటికెళ్దాం.

కొండయ్య : అంతా మీ ఇష్టమే నండి

( యువకుడు ప్రవేశం )

యువకుడు : నిర్మాతగారూ! (పెద్దగా అరుస్తూ వచ్చి కాళ్ళ మీద పడతాడు)

సీతారామయ్య : నువ్వెవరయ్యా!

యువకుడు : నే నెవరైందీ తరవాత చెబుతాను ముందు మీరు మాటివ్వాలి.

సీతారామయ్య : ఎందుకయ్యా? ( లేపుతాడు )

యువకుడు (పడి) ముందు మీరు మాటివ్వాలి, అంతే. లేకపోతే నేను ఈ కర్చిఫ్‌తో ఆత్మహత్య చేసుకుంటాను. రేపు పేపర్లో పడుతుంది. మీ ఆఫీసులో నేను చచ్చిపోయానని. ఆ పాపం మిమ్మల్ని చుట్టుకుంటుంది.

కొండయ్య : ఇక్కడ చావద్దు. బజార్లో చావు.

యువకుడు : మీరు మాట ఇవ్వాలి. లేకపోతే నిజంగా చచ్చిపోతాను. (లేవడు)

సీతారామయ్య : కొంపదీసి వచ్చాడా ఏమిటి? సరే మాటిచ్చాను లేవయ్యా.

యువకుడు : ) లేచి, ఒక్కసారి కాలర్ ఎగరేసి, క్రాపు సరి చేసుకొని కుర్చీలో కూర్చుంటాడు ) నా పేరు రాజా. షూటింగ్ ఎప్పుడు మొదలు పెడతా వంటారు ?

సీతారామయ్య : ఈడెవడండీ కుర్చీలో కూచుంటాడు?

రాజా : ఇప్పుడిక్కడ కూర్చున్నాను. రేపు మీ భుజాల మీదే కూర్చుంటాను. నేను మీ సినిమాలో...హీరోని.

కొండయ్య : కలొచ్చిందా రేతిరి?

రాజా : ఇప్పుడు ఈయనేగా మాటిచ్చాడు నన్ను హీరోగా పెట్టుకుంటానని.

సీతారామయ్య : (ఆశ్చర్యంగా) నే నెప్పుడన్నాను?

రాజా : నేను మాట తీసుకుంది దాని కోసమే . . ,

సీతారామయ్య : (విసుగ్గా) ఎటూ సినిమా తియ్యక తప్పటం లేదు గాని, కొన్ని ప్రశ్న లడుగుతాను. బదులుచెప్పు. ఇదివరకు ఎన్ని సినిమాల్లో ఉన్నావు?

రాజా : ఎందులోనూ లేను.

సీతారామయ్య : నాటకాల్లో ఉన్నావా?

రాజా : లేను.

కొండయ్య : మరి చిన్నప్పుడు దేన్లోనైనా బాలనటుడిగానన్నా ఉన్నావా?

రాజా : ఎప్పుడూ లేదు. నేను పుట్టుకతోనే నటుణ్ణి. డైలాగు చెబితే పేలుతుంది. స్టెప్ వేశావంటే జనం లేచి ఆడతారు.

కొండయ్య : బైటికి పోవడానికి.

రాజా : నా సత్తా నీకు తెలీదు.

సీతారామయ్య : బాబూ, నువ్వు హీరోగా పనికిరావు. ఏమీ అనుభవం లేదుగా?

రాజా : అవమానిస్తున్నారు కదూ?

కొండయ్య : పిల్లలు నిన్ను సినిమాలో చూస్తే దడుసుకుంటారు.

సీతారామయ్య : బాబూ! అస లీ వూరు ఎట్టా వచ్చావయ్యా!

కొండయ్య : మసలాగానే వచ్చుంటాడండి, చెప్పాపెట్టకుండా.

రాజా : అయితే మనం మనం చుట్టాలమే నన్నమాట. మా అయ్య మోటారు పంపుసెట్టు బాగుచేయించుకు రమ్మని పంపితే అదిమ్మేసి, ఇట్నుంచి ఇటే బండెక్కి వచ్చాను. నాలో కళామతల్లికి సేవ చేద్దామనే కోరిక ఉంది.

సీతారామయ్య : తప్పుగదూ! చార్జీలకి డబ్బులిస్తాను. ఇంటికెళ్ళు. ఇంకెప్పుడూ రావద్దు.

రాజా : నాలోని కళను మీరు గుర్తించరన్న మాట. ఒక రోజు నేను మహానటుణ్ణి అయిపోతాను. అప్పుడు మీరే బాధపడతారు.

కొండయ్య : ఇప్పుడు నువ్వు పోకపోతేమాత్రం చాలా బాధపడతావు.

రాజా : నా ఫోటోలు మీ రెప్పుడూ చూళ్ళేదు. చూస్తే వదిలిపెట్టరు. కొన్ని వందల పోజుల్లో తీయించుకున్నాను. తొందరగా తీసేస్తే వెళ్ళిపోతానని ఫోటోగ్రాఫర్ నన్ను చూస్తూ చాలా ఆలస్యం చేసేవాడు.

సీతారామయ్య : నువ్వే ఎదురుగా ఎలిగిపోతుంటే నీ ఫోటో ఎందుకు, బాబూ!

రాజా : నన్ను వెళ్ళిపొమ్మంటున్నారు కదూ?

కొండయ్య : అసలు మీరు సినిమాల్లో పనికిరారండి. అరవై ఏళ్ళు దాటితేనే గాని జెనం చూడరు.

సీతారామయ్య : అయితే నేనే పనికొస్తానన్న మాట.

రాజా : మీరే ఉండండి. నేను వెళ్తున్నాను.

కొండయ్య : మీదే ఆలస్యం.

రాజా : ( వెళ్తూ ఆగి ) నేను రాజమండ్రి పోతున్నాను.

కొండయ్య : అయ్ బాబోయ్! అది మా వూరేనండి.

రాజా : నాకు తెలుసు. అందుకే వెళ్తున్నాను. సీతారామయ్యగారూ! మీ భార్యపేరు శకుంతలమ్మ కదండీ?

సీతారామయ్య : అవును.

రాజా : మీ అబ్బాయి రాంబాబు—బి, ఎ. చదువుతున్నాడు.

సీతారామయ్య : ( మరీ ఆశ్చర్యంగా ) అవును.

రాజా : ( నిదానంగా ) నేను వెళ్ళి చెబుతాను—మీ రిక్కడ తాగి తందనాలాడు తున్నారని, గుర్రప్పందేల కెళ్తున్నారనీ, క్లబ్బులో కాపురం పెట్టేశారనీ, ఇప్పటికి ఇరవై వేలు తగలేశారనీ చెబుతాను.

సీతారామయ్య : (చేతులు పట్టుకొని) బాబ్బాబు! ఆ మాట మాత్రం చెప్పొద్దు.

కొండయ్య : చెప్పొద్దండి. అమ్మగారు మా అయ్‌గార్ని చీలక తంతారండండి.

రాజా : సరే చెప్పను ... ఇప్పుడు చెప్పండి ... మీ సినిమాలో హీరో ఎవరు?

సీతారామయ్య : నువ్వే.

రాజా : ఒప్పుకుంటున్నారుకదూ.

ఇద్దరూ : నువ్వే హీరోవి. ఒప్పుకుంటున్నాం.

( కర్టెన్ ఒక్కసారి వేసి, తీయాలి )

సీతారామయ్య : సినిమా తియ్యకపోతే చంపేస్తారని ఒప్పుకుంటి, సినిమా తీసేశాం.

కొండయ్య : ఇక ఇంటికెళ్ళటమే మిగిలింది.

సీతారామయ్య : ఒరేయ్! నువ్వు ఇల్లు ఇల్లని ఏడవద్దు. అల్లా సినిమా తీస్తానా చస్తావా అని కూర్చున్నారు. వేలు తగలేసి తీస్తే ఇప్పుడేమవుతుందో ఏమో! డబ్బు లొస్తాయో రావో! ( పైకి చూసి ) నువ్వే రక్షించాలి, దేవుడా!

కొండయ్య : తగలేసింది చాలక దొంగనమస్కారాలు.

సీతారామయ్య : నీ బాబుగాడిదా సొమ్ము! నాది. నా డబ్బు పోతే నే నేడుస్తాను గానీ నీదేంపోయిందిరా? డిస్ట్రిబ్యూటరుపోనుచేస్తానన్నాడు. ఎన్నైందో ఏమో ఇంతవరకు ఫోను చెయ్యలేదు.

కొండయ్య : ఇవ్వాళే కదండి మన పిక్చరు రిలీజయింది.

సీతారామయ్య : అందుకేరా వణికి చస్తున్నాను.

( ఫోన్ మోగుతుంది. )

సీతారామయ్య : (ఫోన్ ఎత్తి) హలో ... నేనండి బాబూ ... నిర్మాత సీతారామయ్యని.

కొండయ్య : డిస్ట్రిబ్యూటరే నండి మాట్లాడేది?

సీతారామయ్య : ( ఫోన్లోనే ) నువ్వు నోర్మూసుకో ... అబ్బే ... మిమ్మల్ని కాదండి ... మావాడేదో అంటేనూ ... అలో ... ఎట్టా ఉందండి మన బొమ్మ ... టాకెట్టా ఉంది? ఏందీ ... ఇచ్చిందా?... సినిమాహాలుముందు మందుల షాపు పెట్టారా—ఆఁ ... అంబులెన్సా ... అంబులెన్సొచ్చిందా ఆటకాడికి?...ఏందీ.. అయిదు పైసల బిళ్ళలకి గిరాకీ వచ్చిందా?

( డిస్కనెక్ట్ అవుతుంది. ఫోన్ పెట్టేసి ) ఆడేందో సరిగ్గా వినపడకుండానే ఫోను పెట్టేశాడు. ఏందో మందులషాపు, అంబులెన్సు, అయిదు పైసలబిళ్ళ అంటున్నాడు.

కొండయ్య : మందులషాపు ఎందుకంటే నండీ, తలనొప్పి మాత్రల కండి. జెనం సినిమా చూడలేక గోలచేస్తుంటే, కుర్చీలు పీకేస్తుంటే పోలీసు లొచ్చి ర్రుండి. దెబ్బలు తగిలినాళ్ళని అంబులెన్సులో ఏసుకు పోతున్నార్టండి. పిలిప్స్ ముక్కలు కొంటానికి అయిదుపైసల బిళ్ళలికిగిరాకీవస్తుంది కదండీ. అదండీ కత. తరవాత ఆటకి ఎవడూ పోడు. చూస్తేమనిద్దరమే చూడాలి. బాక్సులన్నీ బద్రంగా తెచ్చుకోవచ్చు.

సీతారామయ్య : ( అతి నీరసంగా ) అంటే ... నం...టా...వా?

కొండయ్య : ఇది ఎండితెర కాదండి. ఇనపతెర. దీని కింద తెలీనోళ్ళు పడితే కాళ్ళూ, చేతులూ కట్టే పోతయ్. ఉన్న యాపారం చేసుకున్నా ఈపాటికి పదెకరాలు కొనుక్కునేవోళ్ళం.

సీతారామయ్య : కొంపగుండనైపోయిందన్న మాట. ( కుర్చీలో పడిపోతాడు. కొండయ్య నీరసంగా నెత్తిన చేతులుపెట్టుకొని కూర్చుంటాడు. తెర. )

★